క్లుప్తంగా

కమ్మేసిన పొగమంచు



జడ్చర్ల టౌన్: పట్టణాన్ని సోమవారం ఉదయం పొగమంచు కమ్మేసింది. ఉదయం 8గంటల సమయంలో జాతీయ రహదారిపై వాహనాలు లైట్లు వేసుకుని వెళ్లాల్సి వచ్చింది. పాదచారులు, చిరువ్యాపారులు చలికి ఒణికిపోయారు.

రామలింగేశ్వరస్వామి ఆలయంలో భక్తుల రద్దీ



అడ్డాకుల: మండలంలోని కందూర్ శివారులో వెలిసిన రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద జాతర సందర్భంగా సోమవారం ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగింది. బుధవారం ఉగాది పండుగ నేపథ్యంలో ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారు స్వగ్రామాలకు వస్తున్న క్రమంలో స్వామివారి దర్శనానికి భక్తుల తాకిడి పెరిగింది. జాతరకు వచ్చే భక్తులు కొత్త మట్టి కుండలను కొనుగోలు చేసి దాసంగాలను సమర్పిస్తున్నారు. అదేవిధంగా కాశీ తర్వాత ఆలయ పరిసరాల్లో ఉన్న కల్పవృక్షాల కింద భక్తులు వంటలు సిద్ధం చేసి అక్కడే భోజనాలు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సర్పంచ్ శ్రీకాంత్, ఆలయ చైర్మన్ రమేష్‌గౌడ్, ఈఓ రాజేశ్వరశర్మ ఏర్పాట్లు చేశారు. ఉగాది తర్వాత కూడా జాతర కొనసాగి శ్రీరామ నవమి రోజు ముగుస్తుందని చైర్మన్ తెలిపారు.

గ్రామాభివృద్ధికి కృషి

మహమ్మదాబాద్: గ్రామ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్నట్లు సర్పంచ్ వెంకట్రాంరెడ్డి తెలిపారు. సోమవారం గ్రామసభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో జరిగిన అభివృద్ధి, చేపట్టబోయే పనుల గురించి వివరించారు. గ్రామంలో ఇంటి పన్ను అధికంగా వసూలు చేస్తున్నారని సర్పంచ్ దృష్టికి గ్రామస్తులు తీసుకొచ్చారు. ఇళ్ల కొలతల కోసం సర్వే చేయించాలని గ్రామ కార్యదర్శిని కోరారు. డీపీఓ ఆదేశాల మేరకు త్వరలో ఇళ్ల పన్ను తగ్గేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామంలో వెల్‌నెస్ సెంటర్ భవనాన్ని నిర్మించేందుకు స్థల పరిశీలన చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రాములమ్మ, ఉపసర్పంచ్ రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి హాజీ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

గుండెపోటుతో వీఆర్‌ఏ మృతి

మహమ్మదాబాద్: నిద్రలో అకస్మాత్తుగా గుండెపోటుతో వీఆర్‌ఏ మృతిచెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని వెంకట్‌రెడ్డిపల్లికి చెందిన వీఆర్‌ఏ సెంగేరి బాలయ్య (55) 20ఏళ్లుగా గ్రామంలో వీఆర్‌ఏగా విధులు నిర్వహిస్తున్నాడు. ఆదివారం రాత్రి ఇంట్లో నిద్రించాడు. గుండెనొప్పి రావడంతో నిద్రలోనే మృతిచెందాడు. మృతుడికి ఐదుగురు కూతుళ్లు ఉన్నారు. వారిలో ముగ్గురికి వివాహమైంది. సోమవారం మహమ్మదాబాద్ తహసీల్దార్ ఆంజనేయులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు. జిల్లా జేఏసీ చైర్మన్ రామచంద్రయ్య, ఆయా గ్రామాల వీఆర్‌ఏలు కుటుంబాన్ని పరామర్శించి ప్రభుత్వం నుంచి ఆదుకోవాలని కోరారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

నవాబుపేట: మండలంలోని తీగలపల్లి గేట్ సమీపంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఇసుక టిప్పర్‌ను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ పురుషోత్తం తెలిపారు. ఆదివారం రాత్రి అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను విధినిర్వహణలో ఉన్న పోలీసులు చూసి వెంబడించగా, పారిపోయినట్లు తెలిపారు. టిప్పర్ నంబర్ ఆధారంగా యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఆయన వివరించారు.

డివైడర్‌ను ఢీకొన్న లారీ

జడ్చర్ల టౌన్: పట్టణంలోని జాతీయ రహదారిపై మోర్ సూపర్‌మార్కెట్ ఎదురుగా ఆదివారం అర్ధరాత్రి సిమెంట్ లోడ్‌తో ఉన్న లారి డ్రైవర్ రాజు నిద్రమత్తులో డివైడర్‌ను ఢీకొట్టాడు. మాచర్ల నుంచి సిమెంట్ లోడ్‌తో మహబూబ్‌నగర్ వెళ్తుండగా డివైడర్‌ను ఢీకొట్టి ఆరు మీటర్ల మేర బారికేడ్లపైకి దూసుకెళ్లాడు. ప్రమాదం జరిగిన సమయంలో రోడ్డుపై ఎలాంటి వాహనాలు లేకపోవటంతో అపాయం తప్పింది. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేశారు. డ్రైవర్ రాజు సోమవారం పోలీసులకు లొంగిపోయాడు. మధ్యాహ్న సమయంలో లారీలోని సిమెంట్‌ను మరో లారీలోకి డంప్ చేశారు. పాడైన వాహనాన్ని క్రేన్ సహాయంతో పక్కకు తొలగించారు.

నేడు యంత్రపూజ

జడ్చర్ల టౌన్: శుభకృత నామ సంవత్సరం చివరి అమావాస్య కావడంతో మంగళవారం విశ్వబ్రాహ్మణులు తమ పనిముట్లకు పూజలు చేయనున్నారు. కుటుంబం సుఖసంతోషాలతో ఉండేందుకు అమావాస్య రోజున పనులు నిలిపివేసి విశ్వబ్రాహ్మణులైన వడ్రంగులు, స్వర్ణకారులు, కమ్మరులు, కంచరులు, శిల్పి వృత్తి చేసేవారు దుకాణాలు, ఇళ్లను అలంకరించుకుని పూజలు చేస్తారు. ఉగాది మరుసటి రోజున తిరిగి పూజలు చేసి పనులు ప్రారంభిస్తారు.

నిరుపయోగంగా గ్రంథాలయం

- లైబ్రేరియన్ లేక మూతబడిన వైనం
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న పాఠకులు



తాళం వేసి ఉన్న గ్రంథాలయం

మిడ్జిల్: ప్రజలకు విజ్ఞానం అందించే గ్రంథాలయం లైబ్రేరియన్ లేక మూతబడింది. దీంతో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు ఇబ్బందికరంగా మారింది. స్వీపర్ ఉన్నప్పటికీ ఉదయం వేళలో శుభ్రం చేసి వెళ్తారు. కార్యాలయంలో ఉండే పుస్తకాల గదికి తాళం వేసి ఉండడంతో అటుగా ఎవరూ రావడం లేదు. గ్రంథాలయంలో దాదాపు 300 మంది వరకు సభ్యత్వం కలిగి ఉన్నారు. గత ఎనిమిది నెలల కిందటి వరకు ఇంచార్జ్ లైబ్రేరియన్ ఉండగా, నెలలో ఒకటి, రెండుసార్లు మాత్రమే వచ్చేవారు. ప్రస్తుతం ఇన్‌చార్జ్ కూడా లేకపోవడంతో పాఠకులకు, వివిధ పోటీ పరీక్షలకు ప్రిపేరవుతున్న విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి లైబ్రేరియన్‌ను ఏర్పాటు చేయాలని పాఠకులు, ప్రజలు కోరుతున్నారు.

చదువుకోవడం కష్టంగా మారింది..



వివిధ పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్న తరుణంలో లైబ్రేరియన్ లేని కారణంగా ఎప్పుడూ గ్రంథాలయం మూతపడి ఉంటుంది. పుస్తకాలు అందుబాటులో లేకుండా పోయాయి. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి. – వెంకటేష్, మిడ్జిల్

లైబ్రేరియన్‌ను నియమించాలి..



మండల కేంద్రంలోని గ్రంథాలయంలో లైబ్రేరియన్ లేని కారణంగా ప్రజలకు ఇబ్బందిగా మారింది. నిరుద్యోగ యువత, విద్యార్థులు, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని లైబ్రేరియన్‌ను నియమించాలి. – గౌస్, ఎంపీటీసీ, మిడ్జిల్

బేకరీ తయారీ కేంద్రానికి మరోసారి నోటీసులు

- ఫ్యాక్టరీ యాజమాన్యంపై 'ప్రజావాణి'లో స్థానికుల ఫిర్యాదు
- స్పందించి పరిశీలించిన మున్సిపల్ అధికారులు


బేకరీ ఫ్యాక్టరీ యజమానికి నోటీసు అందజేస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీందర్‌రెడ్డి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక వల్లభ్‌నగర్‌లోని ఓ బేకరీ తయారీ కేంద్రం ద్వారా వెలువడుతున్న వాసనతో చిన్నపిల్లలు అనారోగ్యం బారిన పడుతున్నారంటూ స్థానికులు కొందరు సోమవారం కలెక్టరేట్‌లో 'ప్రజావాణి'కి ఫిర్యాదు చేశారు. దీంతో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీందర్‌రెడ్డి అక్కడికి వెళ్లి క్షుణ్ణంగా పరిశీలించారు. బిస్కెట్లు, డబల్ రోటీలు తదితర బేకరీ పదార్థాలను తనిఖీ చేశారు. అనంతరం నిర్వాహకులకు నోటీసులు అందజేశారు. కాగా, ఇదే కేంద్రంపై గత నెల 16న స్థానికులు ఫిర్యాదు చేయగా మున్సిపల్ అధికారులు నోటీసులు ఇచ్చారు. అనంతరం దాని యజమాని ఇచ్చిన సమాధానంతో ఎలాంటి చర్యలు తీసుకోలేదు. తిరిగి ఇప్పుడు ఫిర్యాదు అందడంతో మరోసారి పరిశీలించడం గమనార్హం. ఇదిలా ఉండగా ఆరు నెలల క్రితం ఈ ఫ్యాక్టరీ ఇళ్ల మధ్య ఏర్పాటు చేశారని చుట్టుపక్కల వారు చెబుతున్నారు. ఈ ఫ్యాక్టరీ వల్ల రోడ్డుపై వెళ్లే బడి పిల్లలతో పాటు తాము ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అందులో పేర్కొన్నారు. దీనిని ఇక్కడి నుంచి వేరే ప్రాంతానికి తరలించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

కరాటేతో ఆత్మవిశ్వాసం పెంపు


కోయిలకొండలో బహుమతులు అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి


విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈఓ రాజేశ్వర్‌రెడ్డి

అడ్డాకుల: మండలంలోని పోల్కంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బాలికలు కరాటేలో ఉత్తమ ప్రదర్శన కనబర్చి పథకాలు పొందారు. కరాటే మాస్టర్ శివప్రసాద్ ఆధ్వర్యంలో పాఠశాలకు చెందిన బాలికలు ఈనెల 19న నారాయణపేట జిల్లా ధన్వాడ మండలంలో సౌత్ ఇండియా చీఫ్ ఇన్స్‌పెక్టర్ కనకం యాదవ్ సమక్షంలో నిర్వహించిన జిల్లా స్థాయి న్యూ మాక్స్ కుంగ్‌ఫూ కరాటే చాంపియన్‌షిప్‌లో పాఠశాలకు చెందిన బాలికలు పాల్గొన్నారు. 9వ తరగతికి చెందిన కీర్తన, కావేరి, ఇందు, 7వ తరగతికి చెందిన గాయత్రిలు బంగారు పతకాలు, 8వ తరగతికి చెందిన శ్వేత, 6వ తరగతికి చెందిన శ్రీలేఖలు వెండి పతకాలు సాధించారు. వారిని సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంఈఓ రాజేశ్వర్‌రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నివేదిత, నిరంజన్‌రావు, కరాటే మాస్టర్ శివప్రసాద్ ఉన్నారు.

కోయిల్‌కొండ: విద్యార్థులు ఆత్మరక్షణ కోసం కరాటే, కుంగ్‌ఫూ నేర్చుకోవాలని సింగిల్‌విండో మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ ఆశ్రమ పాఠశాలలో జిల్లా స్థాయి కుంగ్‌ఫూ పోటీల్లో ప్రతిభ కనబర్చిన 22మంది విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కుంగ్‌ఫూ మాస్టర్ రాఘవేందర్, ప్రిన్సిపాల్ హారిక పాల్గొన్నారు.

భూత్పూర్: మండలంలోని తాటికొండ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు పీఈటీ దుమర్ల నిరంజన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను హెచ్‌ఎం శంకరాచారి, సర్పంచ్ సాయికుమార్, విద్యా కమిటీ చైర్మన్ శ్రీనివాసులు విద్యార్థులను అభినందించారు.

నవాబుపేట: మండలంలోని కొల్లూర్ జెడ్పీ పాఠశాలలో సోమవారం కరాటే బెల్టులను 12 మంది విద్యార్థులకు అందించినట్లు నిర్వాహకుడు చెన్నయ్య తెలిపారు. అనతికాలంలోనే విద్యార్థులు కరాటే శిక్షణలో ప్రతిభ కనబర్చటంపై సర్పంచ్ సౌజన్య, ఎంపీటీసీ తులసీరాం నాయక్, మార్కెట్ వైస్ చైర్మన్ చందర్‌నాయక్, రఘు, ఖజామైనొద్దీన్ అభినందించారు.

గురుకులలో మాక్ పోలింగ్


పోలింగ్‌లో ఓటు వేస్తున్న విద్యార్థి

భూత్పూర్: ఎన్నికలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు విద్యార్థులకు మాక్ పోలింగ్ నిర్వహించినట్లు మహాత్మాజ్యోతిరావు పూలే గురుకుల బాలికల పాఠశాల స్పెషల్ ఆఫీసర్ బస్వరాజ్ తెలిపారు. బ్యాలెట్ బాక్స్‌లో విద్యార్థులు చిన్న కాగితంపై పోటీ చేసే అభ్యర్థుల పేరు పెన్నుతో రాయించినట్లు పేర్కొన్నారు. పాఠశాలలో 375 మంది విద్యార్థులు ఉండగా, 20మంది అభ్యర్థులుగా పోటీ చేశారని, అధికంగా 9వ తరగతి చదువుతున్న స్పందనకు 112 ఓట్లు రాగా, రెండో స్థానంలో గాయత్రికి 40ఓట్లు వచ్చాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రియాంక, పద్మవాణి తదితరులు పాల్గొన్నారు.

శ్రమ దోపిడీ సరికాదు

జడ్చర్ల టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ సూపర్‌వైజర్ కార్మికులకు జీఓ నంబర్ 21ని తక్షణమే అమలు చేయాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సురేష్ డిమాండ్ చేశారు. సోమవారం బాదేపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్వహించిన శానిటేషన్, పేషెంట్‌కేర్, సెక్యూరిటీ విభాగాల కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ వేతనాల కోసం రాష్ట్రవ్యాప్తంగా దశలవారీగా ఉద్యమాలు చేసిన ఫలితంగా 2021 జూన్ 25న జీఓ నంబర్ 21ని విడుదల చేసిందన్నారు. ప్రభుత్వమే దొడ్డిదారిన ఆ జీఓను అమలు చేయకుండా పెండింగ్‌లో ఉంచిందన్నారు. దీని ఫలితంగా కార్మికులు తీవ్రమైన ఆర్థిక శ్రమదోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో కార్మికులు నాగరాజ్, విజయలక్ష్మి, మణెమ్మ, శివలీల, అలివేల, చిలకమ్మ పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలి


మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కోశాధికారి శాంతికుమార్

జడ్చర్ల టౌన్: రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రశ్నాపత్రాలు లీకేజీ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని బీజేపీ రాష్ట్ర కోశాధికారి బండారి శాంతి కుమార్ డిమాండ్ చేశారు. ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారంపై రాష్ట్ర శాఖ ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం మండల పరిషత్ కార్యాలయం ఎందుట చేపట్టిన నిరసన దీక్షలో ఆయన పాల్గొని మాట్లాడారు. మంత్రి కేటీఆర్‌ను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలన్నారు. టీఎస్‌పీఎస్‌సీ చైర్మన్‌ను పదవి నుంచి తొలగించాలన్నారు. లీకేజీ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం సిట్‌తో కాకుండా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే తెలంగాణ నిరుద్యోగుల నోట్లో మట్టికొట్టి తన ఇంటికి ఐదు ఉద్యోగాలు ఇచ్చుకున్న సీఎం కేసీఆర్ బంధువులు, కనుసన్నల్లో ఉండే వారికి ఉద్యోగాలు ఇప్పించే కుట్ర చేశారని ఆరోపించారు. 30లక్షల మంది జీవితాలను ఆగం చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మచారి, నాయకులు కుమ్మరిరాజు, సామల నాగరాజు, నర్సింహులు, ఆర్.శ్రీనివాస్‌గౌడ్, బాల త్రిపురసుందరి, సాహితిరెడ్డి తదితరులపాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోండి


కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కోయిల్‌కొండ: మండలంలోని దమాయపల్లిలో సోమవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎంపీపీ శశికళ, జెడ్పీటీసీ విజయ్‌భాస్కర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కంటి వెలుగు కార్యక్రమంలో వైద్యులతో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి అర్హులైన వారికి అద్దాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జయరాములు, వైస్ ఎంపీపీ కృష్ణయ్య, సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి చైతన్య, నాయకులు భీంరెడ్డి, ప్రవీణ్, బాలయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.

గండేడ్: కంటి వెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని దోమ వెంకటయ్య తెలిపారు. సోమవారం మండలంలోని లింగాయపల్లిలో కంటివెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఆశన్న, వైద్యాధికారి ప్రవీణ్ కుమార్, కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నపత్రం లీకేజీపై చర్యలు తీసుకోవాలి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న యువజన కాంగ్రెస్ నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: టీఎస్‌పీఎస్‌సీ ప్రశ్నపత్రం లీకేజీ చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని మహబూబ్‌నగర్ అసెంబ్లీ యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ రవినాయక్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం అసెంబ్లీ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జె.చంద్రశేఖర్ మాట్లాడుతూ టీఎస్‌పీఎస్‌సీ ప్రశ్నపత్రం లీకేజీ చేసి రాష్ట్రంలోని 30వేల మంది నిరుద్యోగుల జీవితాలను రోడ్డున పడేశారని ఆవేదన వ్యక్తం చేశారు. లీకేజీ విషయంలో ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లుగా వ్యవహరించడం బాధాకరమని తెలిపారు. నిరుద్యోగులకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి రాఘవేందర్ యాదవ్, నాయకులు రమేష్ నాయక్, షంసుద్దీన్, రఘు, మహ్మద్‌జాకీర్, బుచ్చన్న, వసీం, మురళి తదితరులు పాల్గొన్నారు.

మాదిగల సంగ్రామ పాదయాత్ర


సంగ్రామ పాదయాత్ర నిర్వహిస్తున్న నాయకులు

మహబూబ్‌నగర్ రూరల్: ఎస్సీ వర్గీకరణ సాధన కోసం చేపట్టిన మాదిగల సంగ్రామ పాదయాత్ర సోమవారం మహబూబ్‌నగర్‌కు చేరుకుంది. ఏప్రిల్ 2వ తేదీ వరకు హైదరాబాద్‌కు చేరుకొని 3న బీజేపీ కార్యాలయం ముట్టడి, అప్పటికీ బీజేపీ స్పష్టమైన వైఖరి తెలియజేయకపోతే 4న హైదరాబాద్‌ను దిగ్బంధం చేస్తామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి యాదగిరి, ఎంఎస్‌పీ జిల్లా కన్వీనర్ కావలి కృష్ణయ్యలు తెలిపారు. బూటకపు మాటలు చెప్పిన బీజేపీకి బుద్ధి చెప్పే విధంగా మాదిగల సంగ్రామ పాదయాత్ర కొనసాగుతుందని అన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే వంద రోజుల్లో ఏబీసీడీ వర్గీకరణ చేస్తామని బీజేపీ మూల సిద్ధాంతకర్త దీన్‌దయాల్ ఉపాధ్యాయ స్ఫూర్తి అని తిరుపతి వేంకటేశ్వరస్వామి, భద్రాచలం శ్రీరాముడిల సాక్షిగా తీర్మానాలు చేసి దేవుళ్లను విస్మరించి మాదిగలను బీజేపీ మోసం చేసిందని అన్నారు. రాబోయే రోజుల్లో బీజేపీని రాజకీయంగా బొంద పెడతామని హెచ్చరించారు. వచ్చే పార్లమెంట్ సమావేశాలలో ఏబీసీడీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని, లేనిపక్షంలో దేశంలో అతిపెద్ద రాజకీయ సంక్షోభం రాబోతుందని అన్నారు. యాత్రలో నాయకులు వెంకటస్వామి, బాలయ్య, కొండయ్య, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

జనచైతన్య యాత్రను జయప్రదం చేయండి

మహబూబ్‌నగర్ రూరల్: బీజేపీ మతోన్మాద, కార్పొరేట్ విధానాలను వ్యతిరేకిస్తూ సంక్షేమం, సామాజిక న్యాయం కోసం సీపీఎం అఖిల భారత కమిటీ పిలుపులో భాగంగా రాష్ట్రంలో మార్చి 27వ తేదీ వరకు జన చైతన్యయాత్రలు ఉంటాయని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రాములు తెలిపారు. సోమవారం జన చైతన్య యాత్ర వాల్‌పోస్టర్‌ను రాములు, నాయకులు కిల్లెగోపాల్, నల్లవెల్లి కురుమూర్తి, చంద్రకాంత్, మోహన్, ప్రవీణ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 26వ తేదీ సాయంత్రం వికారాబాద్ నుంచి నంచర్ల గేటు, మహ్మదాబాద్, హన్వాడ మండల కేంద్రాల్లో యాత్రలో భాగంగా సభలు ఉంటాయని పేర్కొన్నారు. సాయంత్రం 6గంటలకు జిల్లా కేంద్రంలోని క్లాక్‌టవర్ చౌరస్తాలో సభ ఉంటుందని తెలిపారు. ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, లౌకికవాదులు, మేధావులు, అభ్యుదయవాదులు పాల్గొని జన చైతన్య యాత్రలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. యాత్రకు రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్‌వెస్లీ నాయకత్వం వహిస్తారని అన్నారు.

వరిలో సస్యరక్షణ చర్యలపై అవగాహన


మాట్లాడుతున్న జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి


గండేడ్: వ్యవసాయ అధికారుల సూచనల మేరకు వరిలో సస్యరక్షణ తెగుళ్లపై ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో ప్రాజెక్టు వరి అనే అంశంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సో అండ్ రిప్ సంస్థ తెల్పిన వివరాల ప్రకారం వరిలో తెగుళ్లను తట్టుకునే రకం వరి విత్తనాలు, నారుమడి పెంచే రకం, నాటు పద్ధతి తదితర సూచనలు పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో కో–ఆర్డినేటర్ భరత్‌కుమార్, ఏఓ పనీష, గండేడ్ సర్పంచ్ చంద్రకళ, జంగంరెడ్డిపల్లి సర్పంచ్ హన్మంతు, ఎంపీటీసీ బాలయ్య పాల్గొన్నారు.

రైతులకు టార్పాలిన్ కవర్లు పంపిణీ


టార్పాలిన్ కవర్లు అందిస్తున్న ఐసీఐసీ ఫౌండేషన్ సభ్యులు

మహమ్మదాబాద్: ఐసీఐసీ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ రైతులకు ఎంతో చేయూతనిస్తున్నదని గాధిర్యాల్ సర్పంచ్ వెంకట్రాంరెడ్డి తెలిపారు. సోమవారం గాధిర్యాల్‌లో 70మంది రైతులకు 60శాతం రాయితీతో టార్పాలిన్ కవర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐసీఐసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామ అభివృద్ధి కోసం వివిధ పథకాలు చేపట్టడం అభినందనీయమని తెలిపారు. అనంతరం వ్యవసాయాధికారి కృపాకర్‌రెడ్డి రైతులకు పంటల రక్షణ, తెగుళ్ల తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రాములమ్మ, ఉపసర్పంచ్ రామకృష్ణ, సంస్థ సహాయకులు వెంకటయ్య, గోపాల్‌రెడ్డి, రైతులు శంకరయ్య, అంజిలయ్య, నారాయణ, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

తపాలాశాఖ ద్వారా మెరుగైన సేవలు


మాట్లాడుతున్న హన్మంతు

స్టేషన్ మహబూబ్‌నగర్: తపాలాశాఖ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నట్లు డివిజన్ సూపరింటెండెంట్ హన్మంతు అన్నారు. జిల్లా కేంద్రంలోని రెడ్‌క్రాస్ సొసైటీ భవనంలో సోమవారం డివిజన్‌లో నూతనంగా నియామకమైన బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్లకు జీవిత బీమాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీమా ఆవశ్యకతను గ్రామీణ ప్రాంతాల ప్రజలకు తెలియజేసి పీఎల్‌ఐ, ఆర్‌పీఎల్‌ఐ పాలసీలను చేయించాలని కోరారు. కార్యక్రమంలో పోస్టల్ ఇన్‌స్పెక్టర్ విద్యాసాగర్, రాఘవేంద్రగౌడ్, నారాయణగౌడ్, ఉమాకాంత్, రమేష్ పాల్గొన్నారు.

దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

మిడ్జిల్: మండలంలోని బోయిన్‌పల్లి గ్రామ పంచాయతీలో వాటర్‌మెన్‌గా పనిచేస్తున్న వెంకటయ్యపై ఆదివారం రాత్రి వాటర్ ట్యాంక్ వద్ద మద్యం సేవిస్తున్న గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తెలుగు సత్తయ్య డిమాండ్ చేశారు. సోమవారం దాడిలో గాయపడిన వెంకటయ్యను జడ్చర్ల ఆస్పత్రిలో పరామర్శించారు. పోలీసులు దాడి చేసిన వ్యక్తులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

దోషులను శిక్షించాలి..

మహబూబ్‌నగర్ రూరల్: మిడ్జిల్ మండలం బోయిన్‌పల్లి గ్రామ పంచాయతీ మల్టీపర్పస్ వర్కర్ వాటర్‌మెన్ వెంకటయ్యపై అకారణంగా గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారని తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కురుమూర్తి, కార్యదర్శి వెంకటేష్‌గౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనేక గ్రామాలలో మల్టీపర్పస్ వర్కర్లపై అనేక రకాల దాడులు, దౌర్జన్యాలు, వేధింపులు కొనసాగుతున్నాయని అన్నారు. దర్యాప్తు చేసి దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు.

పనులు నాణ్యతగా చేపట్టండి


చక్రాపూర్‌లో పనులు ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

అడ్డాకుల: మూసాపేట మండలం చక్రాపూర్ అనుబంధ గ్రామమైన కనకాపూర్ తండాలో సోమవారం సీసీరోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. గ్రామ పంచాయతీకి మంజూరైన రూ.10లక్షల నిధులతో కనకాపూర్ తండాలో సీసీరోడ్డు పనులకు స్థానిక సర్పంచ్ శైలజారెడ్డి, మండల రైతుబంధు సమితి అధ్యక్షుడు భాస్కర్‌గౌడ్ పనులను ప్రారంభించారు. పనులు నాణ్యతగా చేపట్టాలని డిమాండ్ చేశారు. ఏళ్లుగా సీసీరోడ్ల కోసం ఎదురుచూస్తున్న తండావాసులు పనులు ప్రారంభం కాగానే సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యాదయ్యగౌడ్, ప్రకాష్‌రెడ్డి, సాయన్న, శంకర్ నాయక్, నాగన్న ఉన్నారు.

బాలానగర్: మారుమూల గిరిజన తండాల్లో, పల్లెల్లో దూరదృష్టితో అభివృద్ధి, మౌలిక సదుపాయలను కల్పిస్తున ఘనత ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి దక్కిందని డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని నేరళ్లపల్లిలో జెడ్పీటీసీ, ఎంపీపీ నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు, అంతర్గత డ్రైయినేజీ పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మండల కోఆప్షన్ మెంబర్ జమీర్ పాష, సర్పంచ్ ఖలీల్, ఎంపీటీసీ లింగునాయక్, చెన్నారెడ్డి, శేఖర్, సుధాకర్, వేణు, లక్ష్మయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టాలి

చిన్నచింతకుంట: ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి పనులకు అందించిన నిధులను అధికారులు దుర్వినియోగం చేశారని, వెంటనే విచారణ చేపట్టాలని తెలంగాణ రక్షణసేన సంఘం రాష్ట్ర కన్వీనర్ కేటీ నర్సింహారెడ్డి డిమాండ్ చేశాడు. సోమవారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రభుత్వం రూ.కోట్లు ఇచ్చిందన్నారు. అధికారులు కాంట్రాక్టర్లతో కుమ్మక్కై, పనులను నామమాత్రంగా చేపట్టి నిధులను దుర్వినియోగం చేశారని ఆరోపించారు. సమాచార హక్కు చట్టం సమాచారం మేరకు మండలానికి పలు అభివృద్ధి పనులకు 2014 నుంచి నేటి వరకు వివిధ శాఖల ద్వారా రూ.200కోట్ల నిధులు అందించిందన్నారు. అట్టి నిధులతో అధికారులు గ్రామాల్లో వైకుంఠ ధామాలు, చెత్త సేకరణ షెడ్లు, క్రీడా మైదానాలు, సీసీరోడ్లు, డ్రైయినేజీల పనులను నామమాత్రంగా చేపట్టి దాదాపుగా రూ.70కోట్లు దుర్వినియోగం చేశారని ఆరోపించారు. అక్రమ వెంచర్లపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకొని గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో నియోజకవర్గ బీఎస్పీ ఇన్‌చార్జ్ సంతోష్‌రెడ్డి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా రాజస్తానీ గంగోర్


నృత్యాలు చేస్తున్న మహిళలు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని క్లాక్‌టవర్ చౌరస్తాలో గల రాజస్తాన్ సమాజ్ భవనంలో రాజస్తానీ మహిళా మండలి ఆధ్వర్యంలో గంగోర్ సాంస్కృతిక కార్యక్రమాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం రాజస్తానీ సంప్రదాయ నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మహిళా మండలి అధ్యక్షురాలు కిరణ్‌గుప్త, కార్యదర్శి సునీత రాఠి, జమున హర్‌కుట్, సూరజ్‌కాంత్ దూత్, లీల తపాడియా, లీలబజాజ్, శోభదాగ, ప్రేమజ్యోతి తదితరులు పాల్గొన్నారు.